AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

17-4-2026 (Friday) | MAIN EDITION

## డీలిమిటేషన్‌తో కొత్త నాయకత్వం: కిషన్‌రెడ్డి



**అక్షరటుడే, ఢిల్లీ:** డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్న పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కొత్త నాయకత్వం ముందు కొస్తుందన్నారు. ఈ క్రమంలో రాజకీయ వారసత్వం పోతుందన్న భయంతో.. బిల్లును పలు రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్‌పై కేంద్ర మంత్రి విమర్శలు చేశారు. అది అసదుద్దీన్ ఒవైసీ హైబ్రిడ్ ఫార్ములా అన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకమన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.

## కొండాపూర్‌లో డ్రగ్స్ కలకలం




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ దందా ఆగడం లేదు. డ్రగ్స్, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈగల్ టీం, ఎస్‌వోటీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపడుతున్నా.. డ్రగ్స్ దందా సాగుతూనే ఉంది. తాజాగా పోలీసులు కొండాపూర్‌లో డ్రగ్స్ పట్టుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ముఠా విజయవాడ నుంచి డ్రగ్స్‌ను సేకరించి హైదరాబాద్‌కు తీసుకు వస్తుంది. నిందితుల వద్ద నుంచి పోలీసులు 6.09 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ రవాణాలో పాల్గొన్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## విమానాశ్రయంలో గంజాయి పట్టివేత



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికురాలి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళ లగేజీని తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ఆమె వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

## ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబు బెదిరింపు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: నగరంలోని ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. బాంబు బెదిరింపు సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు.

## అనకాపల్లి జిల్లాలో భూప్రకంపనలు



అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లాలో భూప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందారు. రాంబిల్లి, ఎలమంచిలి, కోటఉరట్ల మండలాల్లో భూప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. రిక్టర్ స్కేల్‌పై వీటి తీవ్రత 3.7గా నమోదైంది. అర్ధరాత్రి 12:05లకు ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## నారీశక్తికి ముళ్లకంచె వేసిన ప్రధాని : శశిథరూర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ శుక్రవారం లోక్‌సభలో ప్రసంగించారు. ప్రభుత్వం నారీశక్తికి న్యాయం అనే బహుమతిని ఇచ్చిందని ప్రధానమంత్రి అంటున్నారని, కానీ ఆయన దానికి ముళ్లకంచె వేశారన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు లింక్ చేయడం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సిద్ధంగా ఉందని చెప్పారు. దానిని నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెట్టడం అంటే, సంక్లిష్టమైన పరిపాలనా ప్రక్రియలలో ఒకదానికి భారతీయ మహిళల ఆకాంక్షలను బందీగా ఉంచడమేనన్నారు.

## శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఫ్లై ఓవర్లు, ఆర్‌వోబీలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతోంది. నిర్మాణం పూర్తయిన శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంత్రి శ్రీధర్ బాబు శుక్రవారం ప్రారంభించారు. మైలార్‌దేవ్‌పల్లి నుంచి శాస్త్రిపురం మీదుగా వట్టేపల్లి వరకు రూ. 71 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్వోబీని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.



కీలకమైన మూడు బిల్లులపై ఉత్కంఠ నెలకొంది. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లుల కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంది. దీని కోసం మూడింట రెండింతల మెజారిటీ అవసరం. అధికార ఎన్‌డీఏ కూటమికి అంత బలం లేదు. దీంతో బిల్లులపై ఉత్కంఠ నెలకొంది.

—అక్షరటుడే, నేషనల్ డెస్క్

# బిల్లులపై ఉత్కంఠ

■ మూడు బిల్లులకు నేడు ఓటింగ్ ■ వ్యతిరేకిస్తున్న విపక్షాలు ■ మద్దతు కూడగడుతున్న బీజేపీ

మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసెంబ్లీ, ఎంపీ స్థానాల పెంపు కోసం కేంద్రం బిల్లులు తీసుకొచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లును అన్ని పక్షాలు ఆమోదిస్తున్నాయి. కానీ డీలిమిటేషన్‌ను విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. నేడు రాత్రిలోపు జరగనున్న ఓటింగ్‌లో బిల్లులు నెగ్గుతాయా.. వీగిపోతాయా అనేది తేలనుంది.

### విపక్షాల కీలక భేటీ

ప్రస్తుతం లోక్‌సభలో ఎన్‌డీఏకు 293 స్థానాలు ఉన్నాయి. ఇండి కూటమికి 187 ఎంపీ సీట్లు ఉండగా.. ఇతరులు 63 మంది ఉన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే.. 360 ఓట్లు అవసరం. బీజేపీకి 67 ఓట్లు తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో బిల్లులపై ఓటింగ్‌లో ఏ పార్టీలు ఎటు వైపు మొగ్గు చూపుతాయో చూడాలి. ఎన్డీఏలోని అన్ని పార్టీలు బిల్లులకు మద్దతు తెలిపాయి. వైసీపీ సైతం అన్ని బిల్లులకు మద్దతు తెలుపుతామని ప్రకటించింది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం డీలిమిటేషన్ బిల్లుపై ఓటింగ్‌కు ముందు విపక్షాల కీలక భేటీ నిర్వహించాయి. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించాయి.

### ఆలోచించి ఓటు వేయాలి

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలను ప్రధాని మోదీ కోరారు. మహిళలకు హక్కులు కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆలోచించి ఓటు వేయాలని, మహిళల మనోభావాలను దెబ్బతీయకండి అన్నారు. బిల్లు కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.. అందరం కలిసి చరిత్ర సృష్టిద్దామని పిలుపునిచ్చారు.

### మాకు ఆ సమస్య లేదు

మనమందరం మన జీవితాల్లోని మహిళల ద్వారా ప్రభావితం అయ్యాం, ఎన్నో విషయాలు నేర్చుకున్నాం, వారి నుంచి ఎంతో జ్ఞానాన్ని గ్రహించామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధానమంత్రికి, నాకు మాత్రం ఆ 'భార్య' అనే అంశం (సమస్య) లేదని సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ఈ బిల్లు మహిళల కోసం ఉద్దేశించినది కాదని రాహుల్ విమర్శించారు. దీనికి మహిళా సాధికారతతో ఎటువంటి సంబంధం లేదన్నారు.

### దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం

కేంద్రప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరిట దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే యత్నం చేస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. 2023లోనే మహిళా బిల్లును మనం ఆమోదించినట్లు గుర్తు చేశారు. అంతగా కావాలంటే పాత మహిళా బిల్లును రద్దుచేసి.. ఇప్పుడు మళ్లీ తీసుకురావాలన్నారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టిన మహిళా బిల్లుతో ఓబీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు.

## కేంద్ర మంత్రితో రేవంత్, ఉత్తమ్ భేటీ



**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. వానాకాలం యాసంగి పంట 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని కోరారు. 2025 2026 యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని తెలిపారు. ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ సమావేశమయ్యారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

## సిగాచి ప్రమాద బాధితులను మోసం చేసిన సీఎం : హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్:** సిగాచి పరిశ్రమ ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక సీఎం రేవంత్‌రెడ్డి తన అసమర్థతను చాటుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో గతేడాది జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటిపరిహారం ఇస్తామని ప్రకటించారు. అయితే అందులో సగం కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకాలు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు అయ్యాయన్నారు.

## రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఉద్రిక్తత

**అక్షరటుడే, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఫార్మా భూముల విషయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు గ్రామంలో సభ ఏర్పాటు చేయగా.. సభ నిర్వహించకుండా అడ్డుకోని టెంట్లను, కుర్చీలను కాంగ్రెస్ నాయకులు తొలగించారు. మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డితో పోలీసులు చర్చలు జరిపారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారే అవకాశం ఉండడంతో ఆయనకు బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్బంధించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన మేడిపల్లికి వచ్చితీరుతానని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దీంతో పోలీసులు మేడిపల్లిలో 144 సెక్షన్ విధించారు.



## రూ. 5 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు తగ్గే అవకాశాలు కనిపిస్తుండడం, క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుండడం, రూపాయి విలువ బలోపేతం అవుతుండడం, ఎఫ్ఐఐలు నికర కొనుగోలుదారులుగా నిలుస్తుండడంతో దేశీయ స్టాక్ మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో నమ్మకం బలపడుతోంది. దీంతో ఆసియా మార్కెట్లు నష్టాల బాటలో ఉన్నా.. మన మార్కెట్లు మాత్రం లాభాల బాటలో పయనించాయి. అన్ని రంగాల షేర్లు రాణించడంతో బుల్స్ ది పైచేయిగా నిలిచింది. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 12 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 250 పాయింట్లు కోల్పోయింది. కనిష్టాల వద్ద లభించిన కొనుగోళ్ల మద్దతుతో కోలుకుని 827 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ 31 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 69 పాయింట్లు తగ్గింది. అక్కడినుంచి 275 పాయింట్లు లాభపడింది. చివరికి సెన్సెక్స్ 504 పాయింట్ల లాభంతో 78,493 వద్ద, నిఫ్టీ 156 పాయింట్ల లాభంతో 24,353 వద్ద స్థిరపడ్డాయి.

## థాయ్‌లాండ్ సోంగ్‌క్రాన్ పండుగలో విషాదం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** థాయ్‌లాండ్‌లో ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకునే నూతన సంవత్సరం పండుగ 'సోంగ్‌క్రాన్' ఈసారి సంతోషం కన్నా విషాదాన్నే ఎక్కువగా మిగిల్చింది. ఏప్రిల్ మధ్యలో జరుపుకునే ఈ పండుగ సందర్భంగా వారం రోజులుగా కొనసాగుతున్న వేడుకల్లో ఇప్పటివరకు 191 మంది మరణించగా, 951కి పైగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. సోంగ్‌క్రాన్ పండుగకు ప్రత్యేకత ఏమిటంటే, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద వాటర్ ఫెస్టివల్‌గా గుర్తింపు పొందింది.

## ఆసియా కుబేరుడిగా గౌతమ్ అదానీ..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఆసియా సంపన్నుల జాబితాలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ గణాంకాల ప్రకారం.. అదానీ నికర ఆస్తి విలువ 92.6 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ఇప్పటివరకు ప్రథమ స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ రెండో స్థానానికి పడిపోయారు. గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ముగిసినప్పటికీ.. అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు అదరగొట్టాయి. దీనివల్ల గౌతమ్ అదానీ సంపద కేవలం ఒక్కరోజులోనే 3.56 బిలియన్ డాలర్లు పెరిగింది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఫ్లాట్‌గా ముగియడంతో అంబానీ సంపదలో పెద్దగా మార్పు రాలేదు. ప్రస్తుతం ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ 19వ స్థానంలో నిలవగా, ముకేశ్ అంబానీ 20వ స్థానానికి చేరారు. ఈ ఏడాది అదానీ సంపద 8.10 బిలియన్ డాలర్లు పెరగగా, అంబానీ మాత్రం 16.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూశారు.

## ఘోర ప్రమాదం.. ఆరుగురు సజీవ దహనం..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. సురపుర తాలూకా దేవాపూర్ సమీపంలో శుక్రవారం ఓ ప్రైవేట్ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. కారులో చిక్కుకున్న మరో ఇద్దరిని స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.